క్లుప్తంగా

నేరాల కట్టడికి చర్యలు


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు (టౌన్) : కర్నూలులో నేరాల కట్టడికి, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని కర్నూలు టౌన్ డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక కర్నూలు డీఎస్పీ కార్యాలయంలో ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడుతానన్నారు. అంతకు ముందు నూతన డీఎస్పీని పోలీసులు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి బొకేలు అందజేశారు.

వృద్ధుల కోసం నూతన ఆశ్రమం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని వృద్ధులకు ఆశ్రమం ఇవ్వడానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా ఆశ్రమాన్ని నిర్మించినట్లు ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం మానవత సేవాసంస్థ సమావేశం ఆశ్రమంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎక్కడైనా వృద్ధులు అనాథలుగా బతుకుతుంటే తమ ఆశ్రమానికి వచ్చి సేద తీరాలన్నారు. ఇందుకోసం తమ సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, మనోహర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, యుగంధర్‌శెట్టి, శేషయ్య, మీనాక్షిరెడ్డి పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

కర్నూలు(సెంట్రల్) : ధ్యానం, యోగాలతో మానసిక ఒత్తిడిదూరమవుతుందని శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాక అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని నెహ్రూ నగర్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వేసవి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో రోజువారి జీవితంలో ఉపయోగించే శ్లోకాలు, ప్రార్థనలు, కథలు,భారతీయ సంస్కృతిలతోపాటు యోగ, ధ్యానాలపై అవగహన కల్పిస్తామన్నారు.

పంచమాంకముల ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): మే మూడో వారం పంచమాంకములను ప్రదర్శించనున్నట్లు కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి.హనుమంత రావు చౌదరి తెలిపారు. ఆదివారం సూరన్న తోటలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘానికి దాతల సహకారంతో హార్మోనియం అప్పగించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.అంకయ్య, బైలుప్పల షఫీవుల్లా, పి. దస్తగిరి, తిరుపాలు, సయ్యద్ రోషన్ అలీ, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

జైనులకు ఉచిత వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): శ్రీ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని మార్వాడి వీధిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. యశోదా హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో వైద్యులు బీపీ, పీఎఫ్‌టీ, బీఎండీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి, గుండె, ఎముకలు, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో కార్డియాలజిస్టు డాక్టర్ జితేందర్ జైన్, ఆర్థోపెడిస్ట్ డాక్టర్ సోమేశ్ మంజునాథ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జిజోలే, డాక్టర్ నిఖిత, జైన్ సంఘం అధ్యక్షులు చంపాలాల్ జై పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్) : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే మే డేను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి, అక్కడి నుంచి దేవీ ఫంక్షన్ హాలు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని సెంటర్లలో కార్మిక జెండాలను ఆవిష్కరిస్తామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు తెలిపారు.

వైఎస్‌ఆర్‌టీయూసీ నాయకుడి మృతి


పట్నం రత్నం (ఫైల్)

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకుడు పట్నం రత్నం ఆదివారం మృతి చెందారు. ఆయన గతంలో నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. గుండె పోటు కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతి విషయం తెలుసుకున్న కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు మరి కొంత మంది పార్టీ నాయకులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆరోగ్య భద్రతకు అభా

సమాజంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు, వారికి సత్వరం మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(అభా) కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నాయి. ఈ అకౌంట్‌లో ఒక్కసారి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై కార్డు పొందితే చాలు దేశంలో ఎక్కడైనా, ఏ ఆసుపత్రిలోనైనా వైద్యం చేయించుకునేందుకు సులభమవుతుంది. ఆరోగ్య సమస్యలున్న వారికి ఎంతో ఉపయోగపడే అభా కార్డుల జారీ ప్రక్రియ ప్రస్తుతం జిల్లాలో జోరుగా సాగుతోంది.

- ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత హెల్త్ ఐడీ
- జిల్లా వ్యాప్తంగా సర్వే చేసి ఐడీ నంబర్ జనరేట్ చేస్తున్న వైద్యసిబ్బంది
- ఇప్పటివరకు జిల్లాలో 17 లక్షలకు పైగా వివరాల నమోదు
- హెల్త్ ఐడీ ద్వారా దేశంలో ఎక్కడైనా వైద్యసేవలు
- ఐడీ తెలిస్తే రోగికి సంబంధించిన వ్యాధులు, చికిత్స వివరాలు ప్రత్యక్షం
- వాటి ఆధారంగా మెరుగైన వైద్యం


హెల్త్ ఐడీలు జనరేట్ చేస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర ఆరోగ్య సమస్యలున్న వారు వేరే ప్రాంతానికి వెళ్లినప్పుడు ఆరోగ్య సమస్యలు వస్తే వారికి వెంటనే చికిత్స అందించేందుకు అభా కార్డు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ కార్డు జారీకి ఒకవైపు ఎన్‌సీడీ సర్వే చేస్తూనే మరోవైపు అదే వివరాలతో హెల్త్ ఐడీ జనరేట్ చేస్తున్నారు. జిల్లాలో 23,59,000 జనాభా ఉంటే అందులో ఇప్పటికే 17,75,762 మందికి అభా ఐడీలు నమోదు చేశారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో 75 శాతం మందికి ఐడీ వివరాల నమోదు ప్రక్రియ పూర్తయ్యింది.

హెల్త్ ఐడీ కార్డు జారీ ప్రక్రియ ఇలా...

జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో 532 మంది ఏఎన్‌ఎంలు రోజుకు 500కు పైగా ఆయుష్మాన్ భారత్ యాప్‌లో ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేసి హెల్త్ ఐడీ జనరేట్ చేస్తున్నారు. ఈ వివరాలను ఎవరికి వారు వ్యక్తిగతంగా కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ముందుగా ఆయుష్మాన్ భారత్ యాప్‌లో మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్ వివరాలు, వయస్సు, ఎత్తు, బరువు, ఇతర ఆరోగ్య వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయడం ద్వారా హెల్త్ అకౌంట్ పొందవచ్చు. జిల్లాలో పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా కూడా ఈ సేవలను అందుకోవచ్చు.

హెల్త్ ఐడీ కార్డు ఉపయోగాలు

ఈ కార్డు ద్వారా దేశంలో ఏ ఆసుపత్రికి వెళ్లినా సరే ఐడీ నెంబర్ ఎంటర్ చేయగానే రోగి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది, తద్వారా రోగి అనుమతితో ఆన్‌లైన్‌లో రోగి వివరాలు వైద్యులు తెలుసుకుని చికిత్స అందిస్తారు. మొబైల్ ఫోన్ లేకపోతే నేరుగా బయోమెట్రిక్ (వేలిముద్ర) వేస్తే ఆన్‌లైన్‌లో వివరాలు వెల్లడవుతాయి. ఆన్‌లైన్‌లో రోగి పేరు, ఊరు, అతని ఆరోగ్య వివరాలు, గతంలో చికిత్స అందుకున్న వివరాలు, చేయించుకున్న వైద్యపరీక్షల వివరాలు ఉంటాయి. వీటన్నింటినీ విశ్లేషించి వైద్యులు చికిత్స అందించేందుకు సులభమవుతుంది. షుగర్, బీపీ, ఆస్తమా, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వారి వివరాలను ఐడీలో నిక్షిప్తం చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవల్లో ఆలస్యం లేకుండా సత్వర చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంది. రక్తం గ్రూపు వివరాలు కూడా ఉంటే అవసరమైనప్పుడు రోగికి వెంటనే రక్తాన్ని అందించే వీలవుతుంది. దీంతో పాటు ఎవ్వరికైనా ప్రమాదం సంభవించినప్పుడు అతని ఆరోగ్యపరిస్థితి గురించి పూర్తి వివరాలు హెల్త్ ఐడీలో నమోదై ఉండటంతో సత్వర చికిత్స అందించేందుకు వీలవుతుంది. గతంలో ఆ వ్యక్తికి నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలు కూడా ఐడీలో నమోదై ఉండటంతో మెరుగైన వైద్యం అందించేందుకు వీలవుతుంది.

ఇకపై అంతా పేపర్‌లెస్ ట్రీట్‌మెంటే...!

ప్రస్తుతం ఆసుపత్రికి వెళ్లిన రోగిని డాక్టర్ పరీక్షించడం, ఆ తర్వాత అతని వివరాలను ఓ కాగితంపై రాయడం, అవసరమైన వైద్యపరీక్షలు చేయించడం, కాగితం రూపంలో వచ్చిన రిపోర్టులను ఫైల్ చేయడం, చికిత్స అందించడం చేస్తున్నారు. అభా కార్డు అమలైతే రోగి వివరాలు ఎప్పటికీ ఆన్‌లైన్‌లో ఉండనున్నాయి. ఈ మేరకు ప్రతి వ్యక్తికి ఒక యూనిక్ ఐడీని క్రియేట్ చేస్తున్నారు. వీటినే హెల్త్ ఐడీగా పరిగణించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఆధార్ నంబర్‌తో యూనిక్ ఐడీ నెంబర్‌ను పొంది డిజిటల్ కార్డు అందుకోవచ్చు. లేదా నేరుగా ఎవ్వరికి వారు ఏబీడీఎం వెబ్‌పేజీలోకి వెళ్లి ఆధార్ నెంబర్ నమోదు చేస్తే హెల్త్ ఐడీ వస్తుంది. దీనినే డిజిటల్ కార్డుగా పరిగణిస్తున్నారు. తద్వారా భవిష్యత్‌లో పేపర్‌పై వైద్య చికిత్సల గురించి రాయడం గాకుండా నేరుగా వారి వ్యక్తిగత హెల్త్ ఐడీలోనే వివరాలు నమోదవుతాయి. దీనివల్ల పేపర్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించేందుకు వీలవుతుంది.

ఆరోగ్య వివరాలు స్వచ్ఛందంగా తెలపాలి



ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ(అభా) కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో వేగంగా కొనసాగుతోంది. ఎన్‌సీడీ కార్యక్రమంలోని సర్వేతో పాటు హెల్త్ ఐడీ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఇప్పటికే జిల్లాలో 75 శాతం మందికి పైగా వివరాలను అప్‌లోడ్ చేశాము. త్వరలో మిగిలిన వారివి కూడా పూర్తి చేస్తాము. వలంటీర్ల ద్వారా త్వరలో కార్డులు జారీ అవుతాయి. –హేమలత, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

విద్యార్థులకు స్వీట్ల పంపిణీ


కేక్ కట్ చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ రావు 59వ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో పలు సంఘాల నాయకులు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోన నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేష్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వై. రాజు, చిటికెల శామ్యూల్, ప్రభుదాస్, నవ్యాంధ్ర పార్టీ అధ్యక్షుడు అయ్యస్వామి, హెచ్‌డబ్ల్యూఓ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ డా.బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జూపూడి ప్రభాకర్‌రావు నడుస్తున్నారన్నారు.

పిల్లల్లో దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం

- బాలబాలికలకు వేసవి శిబిరం ప్రారంభం

కర్నూలు(సెంట్రల్) : పిల్లల్లో దేశభక్తి, దైవభక్తులను పెంపొందించడం కోసం ఠాగూర్ విద్యానికేతన్ ముందుకు రావడం అభినందనీయమని విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్ అన్నారు. శరీన్‌నగర్‌లోని ఠాగూరు విద్యానికేతన్‌లో బాలబాలికలకు సనాతన, హైందవ సంస్కృతి, సంప్రదాయాలు, ఆదర్శ హిందూ కుటుంబ విలువలపై అవగాహన కల్పనకు నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచే బాలబాలికలు క్రమ శిక్షణతో మెలగాలన్నారు. దేశం, దైవం, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. వారం రోజులపాటు జరిగే శిక్షణ శిబిరాలను స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రశేఖర్రె డ్డి, శిక్షకులు హేమ, బిందు, అశ్విని, ప్రవీణ్ పాల్గొన్నారు.

తలసీమియా రహిత సమాజానికి కృషి

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా రహిత సమాజానికి కృషి చేస్తున్నట్లు తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రత్నావళి అన్నారు. ఆదివారం కర్నూలులోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న తలసీమియా, సికిల్‌సెల్ సొసైటీ కార్యాలయంలో తలసీమియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నావళి మాట్లాడుతూ 2016 యాక్ట్ ప్రకారం తలసీమియా, సికిల్‌సెల్ వారికి సదరం సర్టిఫికెట్ కోసం ఉన్నతాధికారులకు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఇటీవల కాలంలో వైద్యశిబిరాలు నిర్వహించి, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తలసీమియా పిల్లల కుటుంబాలకు స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, బైరెడ్డి అంజనరెడ్డి, డాక్టర్ అశ్వక్, అనిత, వెంకటరెడ్డి, వడ్డే రమేష్, శ్రీకాంత్, జి. సురేష్ పాల్గొన్నారు.


గురువులతో వివేకానంద సాంస్కృతిక పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆత్మీయ కలయిక

కర్నూలు(సెంట్రల్) : విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు కర్నూలులోని వివేకానంద సాంస్కృతిక పాఠశాల 1989–90 బ్యాచ్ విద్యార్థులు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడిన వీరు దాదాపు 33 ఏళ్ల తరువాత ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని స్కూల్ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను సత్కరించి విందు భోజనాన్ని ఆరగించారు.

ఆధ్యాత్మికం

సర్వాలంకారంలో శ్రీవాసవి మాత

కర్నూలు(సెంట్రల్): జన్మించిన రోజున వాసవీ మాత సర్వాలంకార శోభితురాలై భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా పూలబజార్‌లోని చిన్న అమ్మవారి శాల, కర్నూలు గీత మందిరంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయాల్లో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదలు అందజేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు ఉచిత అన్నదాన శిబిరం నిర్వహించినట్లు మారం చంద్రశేఖర్ తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

కర్నూలు(సెంట్రల్) : మాతా గోవిందమాంబా సమేత జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం వైశాఖ శుద్ధ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఓల్డ్‌సిటీలో జమ్మిచెట్టు పక్కన వెలసిన శ్రీలలితా పీఠంలో అర్చకుడు జగన్మోహన్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తి సంగీత విభావరి కనుల పండువగా జరిగింది.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

కర్నూలు(అర్బన్): శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధనను పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ఉద్యోగ నగర్‌లోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకటరమణాచారి, లక్ష్మణాచారి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. ఈ నేపథ్యంలోనే ... దేవాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, ఉమ్మడి జిల్లాల పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ రియల్‌టైం నాగరాజు, పార్వతమ్మ, క్రిష్ణవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని కలిగి ఉండాలి

కర్నూలు (న్యూటౌన్): సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. ఆదివారం తన నివాసంలో పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు మురళీకృష్ణను గజమాలతో సత్కరించి భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో అంకితభావంతో పని చేసే నాయకులకు, కార్యకర్తలకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాల్వ ముని, మాజీ ఉప సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు అనిల్‌కుమార్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

టౌన్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు సిటీ: ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీకి చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ బైపీసీలో వై.కీర్తన 970/1000, షణ్ముకి 969, చరణ్య 965, జ్ఞాన ప్రసూన 965, సి.హరిత 961, రాహుల్ రాయ్ 953, ఎ.శ్రీధన్య 940 మార్కులు, ఎంపీసీ విభాగంలో లక్ష్మీపురం చరణ్ కార్తీక్ 961, కురువ శ్రీనివాసులు 954, షేక్ సాధక్ వలీ 951, జైసాయి ధీరజ్ 950 మార్కులు సాధించారన్నారు. జూనియర్ హెచ్‌ఈసీలో నాయకల్లు సందీప్‌కుమార్ 462 మార్కులు, కె.అయోష 449, షేక్ అబ్దుల్లా 415, బైపీసీ విభాగంలో ఇ.హరీష్‌గౌడ్ 411/440, జి.వెంకట లక్ష్మి 406, ఆర్.మౌనిక 392 మార్కులు, ఎంపీసీలో హర్షవర్ధన్ 458/470, అబ్దుల్లా మహీ 438 మార్కులు సాధించారన్నారు.

పన్ను రాయితీకి విశేష స్పందన

కర్నూలు (టౌన్): 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లింపునకు నగర వాసుల నుంచి విశేష స్పందన వచ్చింది. ప్రభుత్వం 5 శాతం రాయితీ ప్రకటించడంతో పలువురు వినియోగించుకున్నారు. ఏప్రిల్ 30వ తేదీకి అంటే నెల రోజుల్లో రూ. 22.03 కోట్ల ఆదాయం రెవెన్యూ విభాగానికి వచ్చింది. 2022–2023 సంవత్సరంపై 30 శాతం వృద్ధి సాధిస్తూ నగరపాలక సంస్థ చరిత్ర లోనే అత్యంత ఎక్కువ చెల్లింపులు చేసినట్లు కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం విలేకరులకు తెలిపారు.

ఐ-దోస్తు స్కాలర్‌షిప్ టెస్ట్‌కు 4,300 మంది హాజరు

కర్నూలు(సెంట్రల్): ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఐ-దోస్తు స్కాలర్‌షిప్ టెస్టుకు విశేష స్పందన లభించింది.జిల్లా నలుమూలల నుంచి 4,300 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్య, సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జస్మత్ కౌర్ శేఖాన్ తెలిపారు. కాగా, ఈ పరీక్షను మే 7వ తేదీన మరోసారి నిర్వహిస్తామని వెల్లడించారు.

స్పోర్ట్స్

సాఫ్ట్‌బాల్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను అలంపూర్ జెడ్పీటీసీ ఇస్మాయిల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 28 వరకు కడప జిల్లాలో నిర్వహించనున్న 10 వ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్

ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలు నేర్చుకోవడం ఎంతో అవసరమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక పెద్ద మార్కెట్ కేఎంసీ పార్కులో వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రగ్బీ క్రీడా పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో రగ్బీ క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడామైదానంలో 8 వ రాష్ట్ర స్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల సందర్భంగా మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు చేసిన భరత నాట్యం పలువురిని ఆకర్షించింది. ఆదర్శ విద్యా సంస్థల అధినేత తిమ్మయ్య, డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి సురేంద్ర పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌తో ప్రధాని ప్రజలతో మమేకం

- మేయర్ బీవై రామయ్య


రేడియోలో ప్రధాని మన్‌కీ బాత్ వింటున్న నగర మేయర్ రామయ్య

కల్లూరు : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతి నెల చివరి ఆదివారం రేడియో ద్వారా నిర్వహించే 'మన్ కీ బాత్ కార్యక్రమంతో దేశ ప్రజలతో మమేకమవుతున్నారని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమం 100వ ఎపిసోడ్ పూర్తి చేసుకున్న సందర్భంగా కోడుమూరు రోడ్డులోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో ప్రధానమంత్రి మన్ కీ బాత్ ప్రసంగాన్ని మేయర్ రామయ్య విన్నారు. అనంతరం రేడియో స్టేషన్‌ను పరిశీలించారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 అక్టోబర్ 3న ప్రారంభించిన మన్ కీ బాత్ కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోందన్నారు. ఇది దేశ నెలవారీ సమీక్షగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణచైతన్య, టి.వి.సుబ్బారెడ్డి, చంద్రశేఖర కల్కూర, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కొట్టే చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి

కర్నూలు(రాజ్‌విహార్): వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ మహమూద్ పీర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఎంసెట్, నీట్, పాలిటెక్నికల్, డీసెట్, జేఈఈ, ఇతర పోటీ పరీక్షలకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ద్వారా శిక్షణ ఇచ్చే వారని, అయితే ఈ ఏడాది నీట్, ఎంసెట్ పరీక్షలకు శిక్షణ ఇవ్వకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

ఆదర్శప్రాయులు శ్రీశ్రీ


శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీజీవీ కళాక్షేత్రం సభ్యులు

కర్నూలు(సెంట్రల్): కవి శ్రీశ్రీ ఆదర్శప్రాయులని టీజీవీ కళాక్షేత్రం ప్రెసిడెంట్ పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో శ్రీశ్రీ 113వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్రీశ్రీ భావకవిగా..అభ్యుదయ కవిగా, చివరకు విప్లవ కవిగా మారి రైతులు, పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కవితలు రాశారని కొనియాడారు. శ్రీశ్రీ అభ్యుదయ వాదిగా రాసిన అనేక సినిమా పాటలు జనాదరణ పొందాయని ముఖ్యంగా డబ్బింగ్ సినిమాలకు మాటలు, పాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. కార్యక్రమంలో పల్లేటి కులశేఖర్, రిటైర్డ్ తహసీల్దార్ శంకరప్ప, సాహితీ స్రవంతి కన్వీనర్ జీఎం శేషయ్య, టీజీవీ కళా క్షేత్రం సభ్యులు పీవీ గురుమూర్తి, సంగా ఆంజనేయులు, లక్ష్మీకాంత రావు, సీవీరెడ్డి, బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రమ జీవుల వేడుక

- జిల్లాలో 4 లక్షల మంది కార్మికులు
- కష్టజీవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- వివిధ పథకాల అమలు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం


హమాలీ కార్మికుడు

కర్నూలు(రాజ్‌విహార్): శ్రామిక జీవన సౌందర్యానికి సమానమైనది లేదని శ్రీశ్రీ అన్నట్టు శ్రమకు మించిన ఆయుధం లేదు. శ్రమ శక్తి లేనిదే ఏ దేశ అభివృద్ధి జరగదు. అందుకే శ్రమను గౌరవించాలి..శ్రామికులను ఆదరించాలంటారు. నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం. కష్టానికి తగిన గుర్తింపు, సరైన వేతనం, రోజుకు 8 గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న రోజు(మే 1). సంపద సృష్టికర్తలైన కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది.

జిల్లాలో 1.25లక్షల మంది సంఘటిత, 1.5లక్షల మంది అసంఘటిత, భవన, బీడీ, ఇతర నిర్మాణ రంగ కార్మికులు మరో లక్ష మంది ఉంటారని అంచనా. డ్రైవర్లు 37 వేల మందికి పైగా, దుకాణ, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులు 29,121 మంది, మిగిలిన కార్మికులు మరో పాతిక వేల మంది ఉంటారని కార్మిక శాఖ లెక్కలు చెబుతున్నాయి. చట్టం ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు పని చేయించే చోట కనీస సౌకర్యాలు కల్పించాలి. ముఖ్యంగా మంచినీటి సౌకర్యంతో పాటు నీడ వసతి, టాయ్‌లెట్, బాత్రూం సౌకర్యం కల్పించాలి. అపార్ట్‌మెంట్లు నిర్మించే చోట చుట్టూ నెట్ (వల తరహా తార్పల్ పట్టలు) అమర్చాలి. దీనివల్ల ప్రమాదాలు నివారించవచ్చు. ఎండ తీవ్రంగా ఉన్న రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 4గంటల మధ్య బహిరంగ ప్రదేశాల్లో పనుల చేయించరాదు. అయితే, ఈ నిబంధనలు అమలులో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కార్మికులకు ప్రభుత్వం అండ

ప్రభుత్వం కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం పలు పథకాలు ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రమాద బీమా సౌకర్యంతో పాటు కార్మికులు గుర్తింపు కార్డులు, వారి పిల్లల ఉపకారవేతనాలు వంటి అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. గుర్తింపు కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద, సహజ మరణ బీమా సౌకర్యం కలిగిస్తోంది. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకుంటే ప్రోత్సాహం కింద రూ.5వేలు, కుమార్తె, మహిళా కార్మికురాలు వివాహానికి రూ.20 వేలు, ఈ–శ్రామ్ గుర్తింపు కార్డులు కలిగిన తాపీ మేస్త్రీలతో పాటు వివిధ నిర్మాణ రంగాల్లో ఉన్న అసంఘటిత కార్మికులకు రూ.2 లక్షల ప్రమాద బీమా, ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్ (పీఎం–ఎస్‌వైఎం) పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడు దరఖాస్తు చేసుకుంటే నెలకు రూ.15 వేలు పొందే వీలు ఉంటుంది. టైలరింగ్ వృత్తిలో స్థిరపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఇస్తోంది.

కార్మిక సంక్షేమానికి చర్యలు



జిల్లాలో ఉన్న సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారి చెంతకు చేర్చేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నాం. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు కలిగి ఉండడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే పనిచేసే చోట యజమానులు, నిర్వాహకుల నుంచి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు.

– బాలు నాయక్, జేసీఎల్, కర్నూలు.